ముక్తి

వివిబి. రామారావు

అర్ధపురి పార్వతీపురానికి నాలుగు మైళ్ళ దూరంలో ఉంది. ఊరు నానుకుని ఓ కొండ, కొండమీద చిన్న శివాలయం. నల్లగా ఎత్తైన కొండమీద కొత్త సున్నంతో మెరుస్తున్న ఆలయాన్ని చూసి, ఏనుగుమీద అంబారీలా ఉందని వర్ణించాడో కవి. ఆలయం బహు ప్రాచీనమైనది. ఏటేటా శివరాత్రికి అక్కడ పెద్ద తీర్థం జరుగుతుంది. వేలాది ప్రజలు కాలినడకన రెండెడ్ల బళ్ళలోనూ శివరాత్రి పొద్దున్నే చేరుకుంటారు ఆ ఊరు. చెరువులో స్నానంచేసి, శివార్చన చేసికొని, ఆ రోజంతా అక్కడ గడిపి, రాత్రి జాగారంచేసి (హరికథలూ, బుర్రకథలూ, పురాణకాలక్షేపాలు, నాటకాలూ, చీట్లపేకలూ, జాగరణ సాధ

నాలు) మరుసటిరోజు స్వగ్రామాలకు తరలివెళతారు మోక్షగాములు.

నాటుబండి తప్ప మరో ప్రయాణ సాధనంలేదా ఊరికి. రైలుదారి నాలుగు మైళ్ళదూరంలో ఉంది. ఇక పార్వతీపురాన్ని కలిపే దోవకి, రోడ్డు అనే మాట దానికి వర్తింపచెయ్యడం కష్టమే అయినా, దారికి ప్రత్యామ్నాయంగా వాడేస్తుంటారు ఆ గ్రామస్తులు.

కామాక్షమ్మకు ఐహిక వాంఛలేవీ లేవు. భర్త పోయి మూడేళ్లయింది. ఆమెకు కావలసినవన్నీ ఉన్నాయ్. రత్నంలాటి ఒక్కగానొక్క కొడుకు, డాక్టరీ చదివి పై దేశాలు తిరిగివచ్చాడు. ఆమె భర్త బతికుండగానే. ఆమె చింతంతా ఒక్కటే, కొడుకు ఒక ఇంటి వాడు కావడం చూడలేదే అని.

శివరాత్రికి అడ్డపుశిలలోని ప్రాచీన శివాలయంలో అర్చన చేద్దామన్న సంకల్పంకలిగి కొడుకు కరుణతో చెప్పింది మధ్యాహ్నం అతను భోజనానికి వచ్చినప్పుడు.

"రేపు శివరాత్రి, అడ్డపుశిల వెళదామనుకుంటున్నాను."

"ఈ కోల్డ్‌వేవ్‌లోనా, అక్కడికే వెళ్ళాలని ఎక్కడుంది. శివాలయం ఇక్కడా ఉందిగా!"

"అది కాదురా..."

వాక్యం పూర్తిచెయ్యనియ్యలేదు కరుణ. "ఏమిటో నమ్మా, ఇంత చలిలో నువ్వొక్కడికి వెళ్ళడం నాకిష్టంలేదు ఇక్కడే జానెడు దూరంలో ఉన్న బాపన్న కోనేరులో స్నానంచేసి ఒడ్డునున్న శివాలయంలో అభిషేకంచేయించ కూడదూ, శాస్త్రిగారికి కబురంపుతాను!"

"కాని తీర్థసేవ..."

"పోనీ తీర్థసేవే కావాలంటే, కారు పంపుతాను, గుంప వెళ్ళి రారాదూ? నాగావళిలో స్నానం, వెలసిన కోవిలలో అర్చన"

—పొద్దున్న ఎనిమిదింటికి యాత్ర, మధ్యాహ్నం భోజనం తరువాత రెండు చెంబాల మందూ, అన్న ధోరణిలో చెప్పాడు కరుణ.

కామాక్షమ్మకు గడచిన శివరాత్రులు జ్ఞాపకం వచ్చాయి. సంజీవరావుగారు శివభక్తులు. ఏటేటా ఎడ్లబండిమీదా కొన్నాళ్ళ తరువాత గుర్రంబండిమీదా, మరికొన్నాళ్ళ తరువాత కారుమీదా, కామాక్షమ్మను గుంప తీసుకెళ్ళి తీర్థం సేవిస్తూ ఉండేవారు.-

"అది కాదబ్బాయ్! గుంప ఎప్పుడూ వెళుతున్న క్షేత్రమే. ఇన్నాళ్లై ఈ ఊళ్లో ఉంటున్నా అడ్డపుశిల అనుకోడమేగాని ఎప్పుడూ వెళ్ళలేదు. నిన్నగౌరి చెప్పింది ఆ ఆలయం చాల గొప్పదని. మళ్ళీ శివరాత్రికి ఉంటానో, శివసాన్నిధ్యాన్నే చేరుతానో-గౌరి తోడువస్తానంటోంది. బండికూడా మాటాడేసింది."

"సరే వెళ్ళు. చలికిమాత్రం సరి

యైన ప్రొటెక్షన్ తీసుకెళ్ళు—బండికుదుపు నీకు తెలీదు. కాళ్ళన్నీ వదులైపోతాయి. ఏం అహల్యా, నిజమేనా, నే చెప్పినది?"

—ఏ విషయంలోనైనా మరోసారి అహల్య కన్ఫర్మేషన్ పొందడం అల వాటైపోయింది కరుణకి.

తలవంచుకుని భోజనంచేస్తున్న అహల్య తన నిశ్చయాన్ని చెప్పింది.

"పోనీ, అన్నయ్యా, దైవదర్శనం కోసం శ్రమదమాదులనుపడడం, దర్శనం కంటె ఎక్కువ పుణ్యకారణమని మన వాళ్ళ నమ్మిక. గౌరితోడుంటుందిగా. మిగిలిన ఏర్పాట్లన్నీ నే చేస్తా!"

అక్కడికి ఆ నిర్ణయం తీసుకోవడం జరిగిపోయింది. మధ్యాహ్నం పనిలోకి వచ్చిన గౌరి పొద్దున్నే దర్శనంచేసుకోవ డానికి వీలుగా పెందరాళే బండి తెస్తా నని వెంకటస్వామి చెప్పాడనీ, సిద్ధంగా ఉండమనీ చెప్పింది.

మరుసటిరోజు పొద్దున్న అదేపనిగా బజ్జర్ మోగుతూంటే అహల్య కిందకి వచ్చి తలుపుతీసింది.

"అదేంటే గౌరీ, అలా కొట్టేస్తున్నావ్, నేను కిందకు దిగిరావాలా?"

"అయిదైపోనాదటమ్మా, రామారావ్ ఒటల్ కాడ గంట సూసినాడు ఎంకట సోమి."

—కామాక్షమ్మ బజ్జర్ శబ్దం విని దిగిరానే వచ్చింది.

"పిన్నీ, అక్కడ స్నానం చేసే కంటె, ఇక్కడే స్నానంచేసి బయలు దేరరాదూ?"

"అదెలా పనికొస్తుందే." అంటూ తొందర తొందరగా తెమిలిపోయింది కామాక్షమ్మ. వెంకటస్వామి బండిలో పరుపూ, దిండ్లూ వేశాడు. రగ్గూ, స్వెట్టరూ, శాలువా, ఇంకా ఏమిటేమిటో సర్దేసింది అహల్య.

"అహల్యా, కరుణా, మీరు ఆస్పత్రి అంటూ అన్నం మరిచిపోక పెందరాడే ఇంత తిని మరోపని చూసుకోండి. నేను పొద్దున్నే మరోసారి దర్శనం చేసుకుని వచ్చేస్తా! ఒరేయ్ పొద్దిగా, ఇల్లు జాగ్రత్త!" స్టూలుమీదనుంచి బండి ఎక్కింది కామాక్షమ్మ.

బండి ఊరు దాటింది.

"తీర్థంలో ఏదేటి కొంటావ్ గౌరమ్మా? రంగులరాట్నం ఎక్కుతావా? నీకేం బయంనేదులే నేనూ ఉంటా!" వెంకటస్వామి కదిపాడు.

"రంగులరాట్నం నువ్వెక్కుతావా? పకుక్కన ఇరిగిపోదూ?"

"ఇరిగిపోదునేవే, చిన్నదనుకుంటు న్నావేటి; ఎంత ఎత్తుంటుందో తెలుసా... అంతా ఎక్కాక తరువాత తిప్పుతారు కిందనుంచీ, మా సరదాగుంటాదనుకో!"

—బండి ఇరుకుగా ఉన్న ఓ గోరి జలో ప్రవేశించింది. బండిచక్రాలకు



పక్కనున్న గుబుర్లు తగిలి రాస్తుంటే వింతైన శబ్దం.

"గౌరీ, మీ అమ్మ నీ పెళ్ళి సంగతేమిచేసిందే?"

—తీరుబడిగా అడిగింది కామాక్షమ్మ.

"అదెందుకు తలపెడతారమ్మగోరూ, పిల్ల అత్తోరింటికెళితే టీ కొట్టెవడు జూత్తాడు?"

గౌరి మనసు చివుక్కుమంది.

అయ్య సచ్చిపోయాక తనను పట్టుకుని, ఆ ఇంటా, ఈ ఇంటా పన్జేసి మెల్లగా టీ దుకాణ మెట్టింది. ఎనిమిదేళ్ళ గౌరిని లాయరుగారింట్లో పనికి కుదిర్చింది. లాయరుగారు మకాం ఎత్తేశాక డాక్టరుగారింటో.

నాటుదోవ వళ్లు కుదివేస్తోంది.

"వెంకటస్వామీ, సగందోవ వచ్చామా?"

"వచ్చామండమ్మగోరూ, అదేటి, ఆ తాటిచెట్లెనకే ఉంది ఊరు."

తాటిచెట్ల దగ్గర కొచ్చేసరికి ఏడు దాటింది.

"ఇదిగో నమ్మగోరూ, ఈడే తీర్థం జరుగుతాది. బండి ఊళ్లోకి తీసుకెళ్ళమంటారా, ఎడ్లనీడే ఇప్పేమంటారా?"

—బండి దిగితే చాలనుకుని గౌరి సాయంతో బండి దిగింది కామాక్షమ్మ.

"అమ్మగోరూ, నే ఎడ్లకు మేతపడేసి ఆ ఎనక గుడికెడతా. మీరూ గౌరి ముందుపదండి. బండికాడ నేనుంటా."

గౌరి, కామాక్షమ్మా కోనేటికేసి నడిచారు. ఇంకా తీర్థసమ్మర్దం కోనేటికి సోకలేదు. ఓ పక్కగా రేవుదగ్గర స్నానం ముగించుకున్నాక ఇద్దరూ గుడికెళ్ళారు.

"కౌండిన్యసగోత్రం, కామాక్షమ్మ" గోత్రనామాలు చెప్పింది పూజారికి.

రుద్రాభిషేకానికి సంచితో కొబ్బరి కాయలు పూజాసామగ్రి పట్టుకొచ్చింది గౌరి.

"ఈ గుళ్లోంచి కాశీకి సొరంగం ఉందట నిజమేనా?" గౌరి వక్కానున్నాయన్ను అడిగింది.

"అవునమ్మా! ఆ బండలమధ్య చిన్న చీలిక కనపడటంలేదూ, ఆ చీలిక ఒకప్పుడు చాలా పెద్దగా ఉండేదట. ఆ చీలిక వెంట వెడితే విశ్వేశ్వర సన్నిధికి ఓ సొరంగ మార్గం కనపడేదట. కాని ఓ భూకంపంవచ్చి సొరంగం అడ్డుగా ఓ శిల పడిందనీ, చీలిక మూసుకపోయిందనీ చెబుతారు. ఇప్పుడల్లాటివి నమ్మే వారెవరున్నారు తల్లీ!"

అర్చన అయిన తరువాత బండి దగ్గరకొచ్చారిద్దరూ. తీర్థప్రజ విరివిగా వస్తున్నారు. మొత్తాలమీద కాలేసి జనంలోకి చూస్తున్నాడు వెంకటస్వామి.

"అమ్మగోరూ! నేనెల్లి తానం సేసొత్తా. బండిలో కూకోండి. గౌరమ్మా, అమ్మగారి దగ్గిరే కూకో. నే ఒచ్చేత్తా!"

దిండుకింద మహాభాగవతాన్ని తీస్తూ అహల్యను మెచ్చుకుని, అష్టమస్కంధంలో సప్తమాధ్యాయం చదువుతుండగా కామాక్షమ్మకు దగ్గరగా నాగస్వరం వినపడింది.

అధ్యాయం చివరకు వచ్చింది. శివుని హాలాహల భక్షణ ఘట్టం పూర్తిచేసి బండిలోంచి కిందకు దిగింది. గౌరి బండి చక్రం వద్ద నుంచుంది.

ఓ పదిగజాల దూరంలో పాముల వాడు గుండ్రని వెదురుపెట్టెలోంచి పాములను తీసి ఆడిస్తున్నాడు. పాముల వాడి కొడుకులా ఉన్నాడో యువకుడు. మధ్య మధ్య ఒక్కొక్కబుట్టా తీసి అందులో పాము బయటకుతీసి చూపించి దానిగురించి చెబుతున్నాడు.

"ఇది సూడండి బాబూ, సంపెంగ నాగు. అల్లంత దూరాన్నుండగా గుప్పున వాసన..."

బారెడుపాము చూడడానికి భయం గొలుపుతూ ఉంది. నాగస్వరం విని పడగ విప్పింది సంపెంగినాగు.

గౌరి ఎవరితోనో చెబుతోంది! "నాగు బాముా, ఔశ్రిపోతూ కొట్లాడుకుంటయట. అది చూసినోళ్ళకు ఎంతో అదృష్టమంట!"

ఎండలో పాముపడగ వింతగా మెరుస్తోంది.

"చూడండమ్మోయ్! ఇది కోడెనాగు. సినిమానాగు కాదమ్మోయ్. అసలు కోడె నాగు." గౌరి దగ్గరకువచ్చి చూపించాడు.

చక్రానికి కరుచుకుపోయింది గౌరి భయంతో.

పాములను ఆడించడం అయిపోయిం తరువాత పాములవాడు వెదురుపళ్ళెంతో

మూకచుట్టూ తిరిగి చిల్లర పోగుచేసుకున్నాడు.

కామాక్షమ్మ గౌరిని పిలిచి ఓ అర్ధ రూపాయి చేతికిచ్చింది.

బండిచక్రం దగ్గర నిలబడి చూస్తున్న గౌరిని ఓ కంట కనిపెడుతున్న పాములబ్బాయి జమీందారిణిలా కనపడుతున్న కామాక్షమ్మ గౌరిని దగ్గరకు పిలిచి చేతిలో ఏదో పెట్టడం చూశాడు.

తండ్రి పోగుచేసిన చిల్లర కిందపరిచి ఉన్న గుడ్డమీదపోశాడు.

చిల్లర మధ్య అర్ధరూపాయి కనపడింది పాములబ్బాయికి.

"డబ్బుగల మారాజులు! మా అమ్మా, మణి, నాగుపాముమణి"— కామాక్షమ్మ దగ్గరకు తీసుకొచ్చాడు.

నల్లగా కాకరగింజలా ఉంది. ''సూసావా పిల్లా, మణి మహత్తెం సూపించమంటా వేది?''

"సూపించు. సూత్తా" బండి చక్రానికి చేరగిలబడ్డ గౌరి కొద్దిగా ముందుకొచ్చింది.

మిసమిస లాడుతున్న జబ్బంతో, కోరమీసాలతో, నవ్వులు చిందించే ముఖంతో, కంఠంలో గర్వంతో కలకల లాడుతున్నాడు పాములబ్బాయి.

ముఖానికి పసుపురాసుకుని పాతకాలం కాని అంత బొట్టెట్టుకుని నుదుటను జుట్టు పడుతూ, ఆరబోసుకోక పోయినా ఆరి పోతున్న జుట్టుతో జిగ్గని మెరిసిపోతోంది గౌరి.

ఇద్దరినీ చూస్తోంది కామాక్షమ్మ.

''ఇదిగో కరిపించేసుకుంటా. ఈ నాగపాముచేత, సూత్తుండగా ఇసం పీల్చేస్తాది సూస్కో.''

—చటుక్కున ఓ బుట్టమూత తీసి లోపలవేలెట్టాడు పాములబ్బాయి.

''అబ్బ నీ సిగదరగ!'' చెయ్యి బయటకు లాగేశాడు...మణిని వేలికి నొక్కి పట్టాడు. ''ఇసం పీల్చేసినాది మణి'' అన్నాడు పాములబ్బాయి.

టీ దుకాణం దగ్గర కెళ్ళి కాసిని పాలు గ్లాసుతో తీసుకొచ్చాడు పాములవాడు. మణి గ్లాసులో వేశాడు.

పాలు కాఫీ డికాషన్ రంగులోకి మారిపోయాయి.

''సూసినావా, మణి మహిమ!''— ఓరగా చూశాడు గౌరివంక పాములబ్బాయి. గౌరి బండిదగ్గరకు వచ్చేసింది.

''అమ్మా, ఆ మణి అమ్ముతాడేమో అడుగుతా, కొంటారమ్మా? చాలా మంచి మణిలా ఉంది.''

''పోనీలే, ఆడగవే కొందాం, ఎంత కిస్తాడో కనుక్కో!''

''మారాజులు, మారాజులు'' అంటూ మణి పట్టుకుని పాములబ్బాయ్ బండి దగ్గరకు వచ్చాడు.

''పదిరూపాయ లియ్యండమ్మా. అసలు నాగమణి. పేనం నిలబెట్టేమణి!''

పదిరూపాయలనోటు పట్టుకెళ్ళి పోయాడు పాములబ్బాయి గౌరి వైపో సారిచూసి. మరికాసేపట్లో బుట్టలు కావిడి వేసుకుని పాములవాళ్ళు మరో పక్కకు పోయారు.

పగలంతా భాగవతం చదువుతూ గడిపేసింది కామాక్షమ్మగారు. రాత్రి కోటేశ్వరరావ్ భాగవతార్ హరికథా కాలక్షేపం. అర్ధరాత్రి మరోసారి కోవెల లోకి వెళ్ళింది కామాక్షమ్మ—

తెలతెలవారుతుండగా తిరుగు ప్రయాణం కట్టారు.

గౌరీ, వెంకటస్వామీ ఏమిటేమిటో మాటాడుకుంటున్నారు.

కరుణ పెళ్ళి తన కళ్ళతో చూస్తానా అని ఆలోచిస్తోంది కామాక్షమ్మ.

వెళ్తున్నప్పటికంటె తిరుగుప్రయాణం సుఖంగానే అయింది.

''తీర్థం బావుందా గౌరీ!''-స్నానం చేసి బాత్‌రూమ్‌లోంచి వస్తూ కరుణ అడిగాడు.

''బలే బాగుంది బాబూ! సౌరంగం మాత్రం మూసుకుపోయినాదట!''

"అలాగా!" —మేడమీదకు వెళ్ళి పోయాడు కరుణ. అహల్య ఉప్మా చేస్తోంది. కామాక్షమ్మగారు రాగానే స్నానంచేసి పూజకని పువ్వులకోసం పెరట్లోకి వెళ్ళింది. సంపెంగచెట్టుకింద గౌరి నిలబడి ఏదో పరాకుగా ఆలోచి స్తోంది.

పువ్వులు కోసుకుని పూజకు కూచుంది కామాక్షమ్మ.

బట్టలువేసుకుని కింద భోజనాల గది లోకి వచ్చాడు కరుణ.

"ఉప్మా తిని చెప్పు అన్నాయ్ ఎలా ఉందో!''

"వండర్‌ఫుల్, అమ్మా నువ్వూ రుచిచూడు!''

''నే నిన్న ఉపవాసం, ఈ రోజు పెందరాడే ఓ బ్రాహ్మడికి పెట్టి మరీ తింటా. శాస్త్రిగారికి కబురుపంపు, పది గంటలకల్లా రమ్మని."

పొట్టిగాడు హడావుడిగా పరిగెత్తు కొచ్చాడు ద్వారం దగ్గరికి.

"బాబూ, బాబూ! అర్జంటు పాము కరిచేసిందట!"

"ఎవరినిరా!"

''ఎవరో నమ్మా, బండిమీద తీసు కొచ్చారు."

''హమ్మ!" అనుకుంది కామాక్షమ్మ. సంపెంగచెట్టుకింద గౌరి నిలబడడమే ఏదోలా అనిపించింది. పాము కరిచిందన గానే గౌరినేమోనని తుళ్ళిపడింది.

కరుణా, అహల్యా లేచి వీధి వరండా లోకి వెళ్లారు.

''గౌరీ! గౌరీ!'' పెరట్లోకి కేకేసింది కామాక్షమ్మ.

పరుగుపరుగున వచ్చింది గౌరి.

''ఎవరినో పాము కరిచిందట. మనం కొన్న మణి ఏదీ?"

''మీకే ఇచ్చేశానమ్మా! కొంగున ముడేసుకున్నారూ!''

"అయ్యయ్యో! ఆ చీరతోనే స్నానం చేశా. డాబామీద ఆరేసినట్టున్నావ్, వెళ్ళి తీసుకురా!" ఆ మాటలంటూనే తనూ వీధివరండాలోకి వచ్చింది.

"అహల్యా, ఎడ్రినలిన్, క్విక్!''

ఇంజక్షన్ ఇస్తూనే అడిగాడు కరుణ పాముకుట్టి ఎంతసేపయ్యిందని.

"పొద్దుగూకులే బాబూ. నిన్న అద్దపుశిల తీర్థాని కెళ్ళినాం, నాలుగు రాళ్ళు దొరుకుతయ్ కదా అని. రాత్తిరి సింతసెట్టుకాడ మకాం ఏసినాం. తెలతెల వారుతుండగా కుర్రోడు లేసి బయట కెళ్ళబోనాడు, తొక్కేసినాడు గొడ్డుని. మంత్రాలేసినాను ఏటి నాబం, గిలగిల్లాడి పోనాడు. చెమటపొట్టి పోనాడు. కాలు ఓసిపోనాది. ఓటే గెంతులు—మాటాడితే అదే వాగుడు, లేదా ఒరిగిపోతన్నాడు. తీర్థంలో బండిదొరకడవే కష్టమైపో నాది."

"ఇదిగోనమ్మా మణి." గౌరి వచ్చింది.

బల్లమీద మనిషినిచూసి కొయ్యైపో యింది.

''సిదేవూరయ్యా!"

''మాకోఊరేటమ్మా, నిన్నఅద్దపుశిల

తీర్థానికెళ్ళినాం. అక్కడే కాటేసింది మాయనాగు.'' — బావురుమన్నాడు పాములవాడు.

''అసలేం పామో తెలుసా, నువ్ చూశావా?'' పేషెంటువైపు చూస్తూ పాములబ్బాయి నడిగాడు కరుణ.

"ఏదో కనపడనేదు బాఁవూ, తాచు పామేమో!"

''పోలీ వెలెంట్ యాంటీ వెనైన్ ట్రై చేస్తే?'' అహల్య అడిగింది.

''వెరీ ఎక్స్‌పెన్సివ్. బట్ లెట్ అజ్ ట్రై!''

పేషెంటుకు ఒంటిమీద స్పృహలేదు. స్పర్శజ్ఞానమూ లేదు. అతని ముఖంలోకే చూస్తున్న కరుణ, అహల్య ఫ్రిజ్ తియ్యబోతుంటే అన్నాడు, ''సారీ అహల్యా! న్యూరోటాక్సిన్ ఫాక్టర్స్ ఆర్ ప్రిడామినెంట్. పల్స్ కూడా ఫెయిల్ అవుతోంది. ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ ట్రై చేద్దాం.''

"అబ్బాయ్, మణి పెట్టరాదూ, ఇది పనిచెయ్యడం నే చూశా!''

శ్వాస ఆడించడానికి ప్రయత్నం చేస్తున్న కరుణ తల్లిమాటలు వినిపించుకోలేదు. మరో ఐదునిముషాలు గడిచాయి.

గౌరి చేతిలో మణి పట్టుకుని అలాగే నుంచుంది.

''అహల్యా, ఇక మనం చెయ్యగలిగిందేఁవీ లేదు. ఇటీజ్ ఎ మేటర్ అఫ్ మినిట్స్ ఫర్ హిమ్. రెస్పిరేటరీ సెంటర్ ఇన్‌వాల్వ్ అయిపోయింది. ది ఫెలో విల్ డై."

"మణి పెట్టరా!''

"మణా? అదెక్కడిదీ?"—వరండామీదకొచ్చిన తల్లిని చూసి ఆశ్చర్యంగా అడిగాడు కరుణ.

''నిన్న ఈ మనిషిదగ్గరే కొన్నాం బాబూ! పాము కరిపించి సూపించినాడు. యిసం లాగేసినాది మణి. పాలు నల్లగా అయిపోనాయ్.''

-పాములవాడు కిందపడి దుఃఖంతో చుట్టుకుపోతున్నాడు.

కరుణకు విషయం బోధపడింది.

''అమ్మా, ఈ అబ్బాయిని రక్షించాలనే నీ ప్రయత్నం సమంజసమే. కాని పాము పడగమీద మణులనేవి ఉండవ్. ఆ పేరుపెట్టి వేటినో అమ్మడం పొట్ట పోసుకునే కోటి మార్గాలలో ఒకటి. అది నీ కమ్మి పదో, పాతికో చేసుకున్నాడు దౌర్భాగ్యుడు. వాడి ఖర్మ, రోజూ పాములనాడిస్తూ పాము కాటు వల్ల చావడం!"

''నాయుడూ! ఇంకెందు కిక్కడ? కొనఊపిరితో ఇంటికి తీసుకుపో కుర్రోడిని!''

పొట్టిగాడి సలహా కటువుగా తోచింది కామాక్షమ్మకి.

ఒంటి వీధి మలుపు తిరిగేవరకూ కింద రోడ్డుమీదకొచ్చి చూసిన గౌరి వరండామీదకొచ్చి గోడకు చేరగిలపడిపోయింది.